# పరీక్ష నేర్పిన పాఠం

ఇసుపల్లి దక్షిణామూర్తి

కమల పుట్టిన ఏడాదితర్వాత పుట్టటమే విమలచేసిన మొట్టమొదటి పొరపాటు. అందుకనే కమలకు చెల్లెలయి వూరుకుంది. లేకపోతే యిప్పుడు కమల చేస్తున్నట్లు తను గూడా అధికారం చెలాయించేదే. చెల్లెలవటంవలన బళ్ళో వేయటం ఒక సంవత్సరం ఆలస్యం జరిగిందంటే అది తన పొరపాటు ఎందుకని అవుతుంది? అది నాన్నావాళ్లు చేసిన అన్యాయం. అందుకనేగదా కమలక్కయ్య తనకంటె పైతరగతి చదువుతోంది. అందుకనే ఆ గర్వం అదీను. ఆవు గడ్డి యెలా నెమరు వేస్తుందో అప్పుడే కమలక్కయ్యకు పాఠంలో వచ్చేసిందిట. తను మాత్రం వక్క సంవత్సరం ఆగితే అవన్నీ నేర్చుకోదేమిటీ! అయినా ఆవు గడ్డి ఎలా నెమరువేస్తోందో తెలుసుకోవటంవలన అక్కయ్యకు ఆధిక్యత ఎట్లా వచ్చిపడేదీ విమలకు అర్థంకావటమే లేదు.

'ఇంకా అట్లానే కూర్చున్నావే...మళ్ళీ బళ్లోకి పోవద్దూ' కమల మేడమెట్లు దిగుతూ గంయిమంటూ ఒక్క కేక వేసేటప్పటికి విమల వులిక్కిపడింది. 'అట్లా గదమాయించకపోతే మెల్లిగాచెప్పరాదూ' అందామని అనుకుంది గాని 'పెద్దలకు విధేయతగా నుండవలెను' అంటూ తను కాపీ పుస్తకంలో రాసుకున్నది గుర్తుకు వచ్చి 'ఛీ... అసలు ఈ పెద్దవాళ్ళని యెందుకు పుట్టించాడబ్బా...ఈ పాడు దేవుడు' అనుకుంది. కమలకు ఈ పాడు దేవుణ్ణి గురించి ఆలోచించవలసిన అవసరం లేదు. తన కెదురుచెప్పని చెల్లాయి యింట్లో వున్నప్పుడు దేవుడి మాట తలచవలసిన అవసరం ఏముంది?

'ఏమిటే పిలుస్తుంటే వినపట్టంలా...యివ్వాళేగా పరీక్ష ప్యాసయింది చెప్పేది...నువ్వు రావా ఏమిటి?' గదమాయింపు స్వరం గట్టిగా వినపడుతోంది. విమల ఈ రోజు సమాధానం యివ్వదలచుకోలేదు. రోజూ అయితే 'అట్లాగే అక్కయ్యా' అనో 'యిప్పుడే వచ్చేస్తున్నా' అనో వున్న చోటునుంచి గబుక్కున లేచి పని చూసుకునేది. ఇవ్వాళ పరీక్షా ఫలితాలు చెపుతారు. ఇంత కాలంనుంచి అక్కయ్య గొప్పగా చెప్పుకుంటున్న తరగతిలోకి తను వెళుతుంది. అక్కయ్య పై తరగతిలోకి వెళితే అది యింకో సంగతి. అక్కయ్యకు తనకు వున్న తేడాలో కొంతభాగం కరిగిపోయే రోజు ఈ రోజు. విమల మనస్సులో దురాలోచన ఒకటి తుపానులా చెలరేగింది. అక్కయ్య ఈ సంవత్సరం పరీక్ష తప్పితే! ఇంకేముంది తనూ అక్కయ్యా ఒకే క్లాసులో కూర్చోవచ్చు. ఆవు గడ్డి ఎందుకు నెమరేస్తుందో, గుర్రంకాళ్లు ఎందుకని పొడుగ్గా వున్నాయో, పిల్లి నోట్లో పొడుగు పళ్లూ పొట్టి పళ్లూ విడివిడిగా ఎన్నెన్ని వున్నాయో లాంటి సంగతులన్నీ అక్కయ్యతోపాటు ఒకసారిగా నేర్చుకోవచ్చు. వీటినిగురించేగా అక్కయ్య యింత కాలంనుంచి గొప్పలు చెప్పుకునేది. అక్కయ్య పరీక్ష తప్పితే బాగానే వుండేటట్లుంది. పరీక్ష తప్పే ప్రసక్తి వచ్చేటప్పటికి విమలకు యింకో భయం ఏర్పడింది. అక్కయ్య పరీక్ష ప్యాసయి, తను తప్పి వూరుకుంటే? అక్కయ్య వయస్సులో పెద్దది కావటం కాకుండా తరగతుల్లో గూడా పెద్దదయితే యింక తన జీవితంలో పెదిమ కదపటానికి వీలుండదు. నిశ్చలంగా కళ్ళు మూసుకుని భగవంతుణ్ణి మనసారా ప్రార్థించింది: 'అక్కయ్య పరీక్ష ప్యాసయినా కాకపోయినా తననుమటుకు పరీక్ష తప్పించవద్దని.'

కమల బట్టలు కట్టుకుని- నాన్న కొన్న కొత్త పరికిణీ కూడా వేసుకుంది. విమల అట్లాగే స్తంభాని కానుకుని కూర్చునేటప్పటికి కమల చివ్వున లేచింది. 'అమ్మా విమల చూడవే...యింతవరకు కదల్లేదు' అంటూ బిగ్గరగా అరచి 'ఛీ...చిన్న

పిల్లలతో ఏ పని పెట్టుకున్నా యింతే...' అంటూ విసుక్కుంది.

'పోన్లే నువ్వే మహా పెద్దదానివి అయిపోయినట్లు...నన్ను తీసుకుని పోనక్కర్లేదులే అమ్మా' విమల నసుగుతూ లేచింది. అక్కయ్య తనను తీసుకుపోకపోతే తను స్వయంగా బడికి పోగలననే ధైర్యం వున్నా ఎందుకనో భయంగా వుంది విమలకు.

'నాతో రాకపోతే..నువ్వొక్కత్తెవే పోతావా బడికి...ఆ సందులన్నీ తిరిగేటప్పటికి దారి తప్పి వూరుకుంటావు' అంది కమల తను ఆ సందులన్నీ తిరగటంలో ప్రవీణురాలనన్నట్లు.

'అ సందులన్నీ నాకూ తెలుసు. మొన్న నువ్వు రాకపోతే నేనొక్కదాన్ని పోలేదేమిటి' అంది విమల ముఖం ఎత్తకుండానే.

'ఆ రోజంటే నీ కన్ని గుర్తులూ చెప్పాను గాబట్టి వెళ్ళగలిగావు... ఈ రోజు చెపుతాననుకున్నావేంటి మహా ఆశ...' అంది విరసంగా తన ఆధిక్యాన్ని ఎట్లాగయినా నిలబెట్టుకుందామన్న ధోరణిలో.

'మొన్నమటుకు నే నడిగానేమిటి...నువ్వే చెప్పావు...'

'పోనీ ఆ సంగతి వదిలిపెట్టినా.. ఏ ప్లస్ బీ ఎంత అవుతుందో చెప్పు గొప్ప తెలుస్తుంది...మహా మాటకి మాట చెపుతున్నావు గాని...అది వదిలిపెట్టినా ఏ మైనస్ బీ ఎంత అవుతుందో చెప్పు చూద్దాం' అంది కమల తను నేర్చుకున్న పాఠాలను ఏకరువు పెడుతూ.

'నాకూ చెపుతారు అవన్నీ ఈ సంవత్సరంలో...' విమల గోడల వంక చూస్తూ అంది. కమల తన పెద్దరికాన్ని నిలపెట్టుకోవటానికిగల అవకాశాలనుగురించి ఆలోచిస్తోంది.

విమల అక్కడినుంచి వెళ్ళిపోగానే కమల చిర్రుబుర్రులాడుతూ బడివైపుకు వెళ్ళిపోయింది. బడిదగ్గరకు వెళ్ళేటప్పటికి పిల్లలంతా గుంపులు గుంపులుగా వచ్చేవాళ్లూ పోయేవాళ్లు. విమలవలన యింత ఆలస్యం అయింది. అప్పుడే పారు, సుశి, మణి అంతా వచ్చేశారు. బడి ఆవరణలో ప్రవేశించటానికి వున్న ఒక్కగేటు చీమ దూరటానికిగూడా సందు లేకుండా వుంది. కమల తన సాహసాన్ని ప్రదర్శిస్తూ గుంపులోకి దూరి పిల్లల్ని అటూ యిటూ తోసుకుంటూ లోపల ప్రవేశించింది. పరీక్షా ఫలితాలు చెప్పటం అయిపోయివుంటుంది. ఎవర్నన్నా కనుక్కోవాలి తను ప్యాసయిన సంగతి చెప్పమని. ఆవరణలో ప్రవేశించినప్పటినుంచి కమలకు గుండె దడగా వుంది. ప్రతి సంవత్సరమూ యింతే. పరీక్ష ప్యాసయినట్లు చెప్పేటంతవరకూ దడ తగ్గదే కాదు. ఎవరిని అడుగుదామా అని ఆలోచిస్తుంటే సుశి, పార్వతి భుజాల మీద చేతులు వేసుకుని నవ్వుకుంటూపోతూ కనపడ్డారు. తనతోబాటు చదివినవాళ్ళని కాకపోతే యింకెవరిని అడుగుతుంది. సరాసరి వాళ్ళకి ఎదురుగా పోయి 'సుశీ...' అంటూ పిలిచింది. పార్వతి ముందుగా చూచింది తనవంక. సుశి చెవులో ఏదో మెల్లిగా చెప్పి పకాలున నవ్వేసింది. సుశి కమలవంక తిరిగి నవ్వలేక వూరుకుంది. కమల కెందుకనో భయం వేసింది. వాళ్ళని అడుగుదామా వద్దా అని ఆలోచనలో పడి అడగటానికి సంకోచించింది. వాళ్లిద్దరూ కమలవంక చూస్తూ గేటువైపుకి వెళ్ళిపోయారు.

ఏకాంతం భరించలేకపోతోంది ఆ ఆవరణలో అంతమంది పిల్లలున్నా. మాస్టారును పోయి అడుగుదామంటే ధైర్యం చాలటంలేదు. తన మేష్టారును కాకుండా యింకెవర్ని అడుగుతుంది? తన ఆలోచనలు తేలకమునుపే లెక్కలమేష్టారు తనదగ్గరగుండా పోతూ ఒక క్షణం ఆగి 'ఏమే కమలా...ఆన్సర్లు సరిగ్గా రాయలా...ప్రతి పరీక్ష వరసాగ్గా ప్యాసయ్యేదానివి...ఇట్లా చేశావేం' అంది. ఆ మాటల్లో వోదార్పు కనపడుతోంది. తను కోరుకోలేదు అటువంటి మాటలను. ఉత్సాహపరిచే మాటలను ఆశించింది గాని యిటువంటి నీరసపు మాటలు వినగానే బిక్కమొగం పెట్టి వాకిట్లోకి పరుగెత్తింది.

ఎదురుగా విమలా, కాత్యాయిని నవ్వుకుంటూ వస్తున్నారు. విమలను చూచేటప్పటికి ముఖం చిన్నబోయింది. వాళ్ళ ఆనందం తనను వెక్కిరిస్తున్నట్లుగాగూడా తోచింది.

"గాంధీమహాత్ముడు చేసిన మంచి పనులు వివరింపుము." హిస్టరీ పేపర్లో ప్రశ్న.

విద్యార్థి జవాబు:- సత్రములు కట్టించెను. రోడ్ల కిరుప్రక్కల చెట్లు నాటించెను. కవులను పోషించెను......" వగైరా.

### "అయితే సరే"

"నాన్నా ఓ కానీ ఇయ్యవూ?"

"సిగ్గు లేదురా. పళ్ళాలు గెళ్ళొచ్చాయి గదా. ఇంకా అన్నప్రాశనం కానీ అర్ధణా అడగడ మేమిటి?"

"అయితేసరే. నాన్నా ఓ రూపా యియ్యి?"

## బాలగేయం: కూలిరాజు

★

**కె. జానకిరామ్ పట్నాయక్**

మిల్లులోని కూలి యొకడు
చల్లని సాయంత్రంలో
నది యొడ్డున కూరుచుండి
హృదయమలర పాడుచుండె!

ఆ త్రోవను రాజుగారు
అతిహాదాదర్జాతో,
పోవుచుండి కూలివాని
పోడిమిగని వింత నొందె!

"ఆహా! యీ కూలివాడు
ఆనందముతో నెట్టుల
అలరుచున్న వాడొగదా?"
అని తలంచి యా నరపతి
అతనికడకు పోయి యిటుల
అడిగెను కడు సాదరమున-

"ఏమోయీ కూలివాడ!
ఎంత హాయినుంటి వీవు?
చీకు చింత లేద నీకు?
నాకు గలదు ధనము! బలము!
నా సరియగు వారు లేరు!
నాయానతి దేవునాజ్ఞ!

కాని నాకు సుఖము లేదు-
మనసునందు శాంతిలేదు!
కటిక పేదవైన నీకు
ఎటుల కలిగె నీ సౌఖ్యము?"

కూలివాడు పాట నాపి
కువలయ పతి నిట్టె జూచి
పలికె నిటుల-చిరునగవున-
"ప్రభూ! నేను పేదవాడ!
ఉన్నదానిలోనె నాకు
ఉన్నదండి తృప్తి-శాంతి-
లేని దాని కెపుడు కూడ
పోను-ఆశపడను ఎపుడు!
అప్పు లేదు-ఆస్తి లేదు-
తప్పుపనులు-చేయబోను!"

ఆ మాటలు విన్న రాజు
అనియె కూలివానితోను-
"ధన్యుడవో మానవుడ!
మాన్యమయ్యె నీదు బ్రతుకు!
చేకొను మివిగోనోయ్-
జోహారులు!...కూలి రాజ!"

నిజానికి విమలకు తను ప్యాసయిన సంగతి తెలుసు గాని కమల 'అక్కయ్య' పరీక్ష తప్పిన సంగతి తెలియనే తెలియదు. కమల వయస్సులో పెద్దది గాబట్టి తనే ధైర్యం చేసి అడిగింది 'ఏమే విమలా పరీక్ష ప్యాసయ్యావా' అంటూ. విమల మౌనంగానే అయ్యాయనన్నట్లు తల వూపింది. కమల పరీక్షసంగతి విమలకు అడుగుదామని మనస్సులో వున్నా కమల ముఖకవళికనుబట్టి అడుగుదామని ధైర్యం తోచ లేదు. అక్కా చెల్లెళ్ళ మధ్య తనెందుకన్నట్లు కాత్యాయిని 'మళ్లా యింటికి వస్తానే విమలా' అంటూ వెళ్లిపోయింది. విమల ఆనందానికి కమల అడ్డువచ్చినట్లయింది. ఇద్దరూ మౌనంగాను గంభీరంగాను నడుస్తున్నారు మెల్లిగా. సందు చివరకు రాగానే కమల విమల భుజంమీద చెయ్యి వేసి దగ్గరకు తీసుకుంది. విమలకు ప్రథమ అనుభవం యిది. ఇంతవరకు తనకు స్నేహితురాండ్రతో అట్లా తిరిగింది గాని తనకు చదువులోను, విజ్ఞానంలోనూ, వయస్సులోనూ పెద్దదయిన 'అక్కయ్య' తనని సమానత్వదృష్టిగా చూడటం యిదే మొదటిసారి. అందుకనే కొంచెం ఉక్కిరి బిక్కిరి అయింది. కమల సంభాషణ ఏదో రకంగా ప్రారంభించే పద్ధతిలో 'విమలా...యిక్వాల్టినుంచి నిన్నేమి అననే...మనిద్దరం కలిసి చదువుకుందాం...ఆడుకుందాం...మనిద్దరికీ యివాల్టినుంచి జోడీ' అంది మాట తడబడుతునే. విమల కళ్లల్లో నీళ్లు నిండాయి 'యిందాక ఏదో కోపంలో అన్నా గాని...యింకెప్పుడూ అట్లా అననక్కయ్యా...నువ్వెట్లా చెపితే అట్లా వింటాను..' అంది. కమలకంటినుంచి జారిన వెచ్చని అశ్రు బిందువులు విమల శిరస్సుమీద చిందినాయి. ★